క్లుప్తంగా

'ప్రేమ'తో రుగ్మతలన్నీ తొలగించవచ్చు



మాట్లాడుతున్న రెవరెండ్ పీటర్

కర్నూలు : ప్రేమను పంచడం ద్వారా సమాజంలోని రుగ్మతలను తొలగించవచ్చునని రెవరెండ్ పీటర్ అన్నారు. శనివారం సి.క్యాంప్ ప్రార్థన మందిరంలో ఆంధ్ర-తెలంగాణ-తమిళనాడు రాష్ట్రాల పరిధిలోని రోడ్డు రవాణా, ఏపీఎస్ఆర్టీసీ క్రైస్తవ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమ్మేళనంలో దక్షిణ కొరియా దేశానికి చెందిన క్రైస్తవ బోధకుడు రెవరెండ్ పీటర్ క్రీస్తు బోధనలను ప్రబోధించారు. కార్యక్రమంలో సి.క్యాంప్ చర్చి పాస్టర్ గంట కరుణ సాగర్, ఆర్టీసీ ఉద్యోగ క్రైస్తవ విశ్వాసులు ఎం.సామ్యేలు, బి.రవికుమార్, రాజేశ్వరమ్మ, ఎద్దుల డేవిడ్ పాల్గొన్నారు.

కమిషనర్ బదిలీకి 'బ్రేక్'

కర్నూలు(టౌన్): నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ బదిలీకి బ్రేక్ పడింది. గత నెల 6వ తేదీ నగరపాలక కమిషనర్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి అదనపు సంచాలకులుగా ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే అప్పట్లో కమిషనర్ రిలీవ్ కాలేదు. ఐఏఎస్ హోదాలో కర్నూలు కమిషనర్‌నే కొనసాగించాలని ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. తాజాగా ఈయననే కొనసాగిస్తూ శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి జీఓ 985 జారీ చేశారు.

చిన్నారులకు టీకాలు వేయాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు తప్పక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన పాతకల్లూరులోని సచివాలయం పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ తనిఖీ చేశారు. అక్కడ ఓపీ, ల్యాబ్, మందుల గదిని, వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

తలసీమియా పిల్లలను ఆదుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా పిల్లలకు రక్తదానం చేయించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డికి శనివారం తలసీమియా బాధిత చిన్నారుల సంఘం నాయకులు కోరారు. కర్నూలులో దాదాపు 200 మంది తలసీమియా చిన్నారులు రక్తం లభించక ఇబ్బంది పడుతున్నారని, తెలిసినవారు, కార్యకర్తలతో రక్తదానం చేయించాలని కోరారు. కార్యక్రమంలో హోమియోపతి వైద్యులు రవిప్రకాష్‌రెడ్డి, తలసీమియా సొసైటీ చిల్డ్రన్ సొసైటీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రిబ్యూషన్ ఫండ్ అందజేత

కర్నూలు : జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న హోంగార్డు (హెచ్‌జీ నెం.1153) మదనగోపాల్ ఇటీవల అనారోగ్యంతో పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. హోంగార్డు కాంట్రిబ్యూషన్ ఫండ్ రూ.2 లక్షల చెక్కును శనివారం ఎస్పీ కృష్ణకాంత్ మృతిచెందిన హోంగార్డు భార్య నాగలక్ష్మమ్మకు అందజేశారు.

రచయితకు సాయం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితకు ఆర్థిక సాయం చేశారు. శనివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, కార్యదర్శి హనుమంతరావు చౌదరి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బైలుప్పల షఫీవుల్లాలు రచయిత డి.పార్వతయ్యకు రూ. 11,720 అందజేశారు.

బాలుడికి అరుదైన ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): అత్యంత అరుదైన నార్స్ అనే వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడికి కర్నూలులోని కిమ్స్ వైద్యులు చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలను ఆసుపత్రి పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత, డాక్టర్ నవీన్‌రెడ్డి శనివారం వివరించారు. వివరాలు వారి మాటల్లోనే...'ఆదోనికి చెందిన దీపక్(9) నాలుగో తరగతి చదువుతున్నాడు. ఉన్నట్లుండి అతనికి నాలుగుసార్లు మూర్ఛ, ఒకరోజు జ్వరం వచ్చింది. దీంతో వారు బాలుడిని కిమ్స్ ఆసుపత్రికి తీసుకురాగా ఈఈజీ, ఇతర పరీక్షల ఆధారంగా అతనికి నార్స్(న్యూ ఆన్‌సెట్ రిఫ్రాక్టరి స్టేటస్ ఎపిలెప్టికస్) అయి ఉంటుందని అనుమానించాము. వెంటనే ఇమ్యునోథెరపీ సహా దానికి సంబంధించిన చికిత్స ప్రారంభించాము. అనంతరం అవసరమైన చికిత్స అందించాము. ఏప్రిల్ 8న చేరిన బాలుడికి ఆరు వారాల పాటు చికిత్స, సూచనలు, సలహాలు అందించాము. నార్స్ అనేది ప్రమాదకరమైన వ్యాధి. ఎందుకొస్తుందో స్పష్టమైన కారణం తెలియదు. ముందస్తుగా గుర్తించి తగిన చికిత్సను ప్రారంభిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చు' అని వారు వివరించారు.

విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్టుమెంట్‌గా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్) : విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్టుమెంట్‌గా ప్రకటించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టుతిమ్మప్ప డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట వివిధ అంశాలపై ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేస్, సీపీఐఎంఎల్ నాయకులు మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ..విద్యాశాఖాధికారులు వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులను పని పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.

నగర స్వచ్ఛతకు ప్రాధాన్యత

- కర్నూలు నగరంలో పారిశుద్ధ్య సేవలు ప్రశంసనీయం
- కార్పొరేటర్లు, ఉద్యోగులు, కార్మికులకు స్వచ్ఛత ప్రశంసాపత్రాలు
- పాల్గొన్న మేయర్, కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు, కమిషనర్



ఉద్యోగులు, కార్పొరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్) : స్వచ్ఛతలో జాతీయ స్థాయిలో 155 వ ర్యాంకుతో కర్నూలు నగరానికి గుర్తింపు లభించందని, త్వరలో అగ్రభాగంలో నిలుపుదామని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న నూతన నగరపాలక కౌన్సిల్ హాలులో డిప్యూటీ కమిషనర్ ఎస్ వి.రమాదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. నగరపాలక ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రైవేటు సంస్థల అధినేతలు కార్పొరేటర్లు సుదర్శన రెడ్డి, విక్రమసింహారెడ్డి, యూనుసు బాషాలకు నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఉన్న కర్నూలుకు ప్రస్తుతం ఉన్న కర్నూలుకు ఎంతో తేడా ఉందన్నారు. గతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త దిబ్బలు, పందులు, కుక్కల స్వైర విహారం కనిపించేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అందరి భాగస్వామ్యంతో చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పారిశుద్ధ కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికులకు నయా పైసా ఖర్చు లేకుండా ఇన్సూరెన్స్ చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం కర్నూలు

- కార్పొరేటర్లు నిరంతరం ప్రజల్లోనే ఉండాలి
- అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలి
- వార్డుల వారీగా అభివృద్ధిపై సమీక్షలో మేయర్, ఎమ్మెల్యే

కర్నూలు (టౌన్): గత నాలుగేళ్ల వైఎస్ జగన్ ప్రభుత్వం నగరంపై చూపిన ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో కర్నూలు నగరం రోల్ మోడల్‌గా నిలిచిందని నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సంయుక్తంగా వెల్లడించారు. శనివారం స్థానిక నగరపాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజ నేతృత్వంలో నగరపాలక సంస్థ పరిధిలోని 2 వ వార్డు, 4 వ వార్డు, 6 వ వార్డు, 13 వ వార్డు, 25 వ వార్డుల అభివృద్ధిపై కార్పొరేటర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మేయర్, స్థానిక ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా వార్డుల వారీగా ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్, రెవెన్యూ విభాగాల సమస్యలపై చర్చించారు. స్థానికంగా కార్పొరేటర్ చెప్పిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంతో పోల్చితే ఇప్పుడు నగరంలో అభివృద్ధి సంతృప్తి చెందే విధంగా చేశామన్నారు. చేసిన ప్రగతిని చెప్పడంలో వెనుకబడిపోతున్నామన్నారు. సోషల్ మీడియాతో పాటు ఇతర ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకుని దూకుడూ పెంచాలన్నారు. కార్పొరేటర్లు నిరంతం ప్రజల్లోనే ఉండాలన్నారు. అధికారులు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. త్వరలో ఇతర శాఖల అధికారులతో కూడా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అర్షియా ఫర్హీన్, సిట్రా సత్యనారాయణమ్మ, నీలోఫర్, విజయలక్ష్మి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఉపకమిషనర్ రమాదేవి, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈలు శేషాసాయి, షాకీర్, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరెడ్డి, డీసీపీ మోహన్, నాగరాజు మెప్మా పీడీ వెంకటలక్ష్మి, డీఈఈ గోపాల్‌కృష్ణ నరేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెంచండి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ సృజన ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుభరోసా కేంద్రంలో నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా పంపిణీ చేయాలని సూచించారు. ప్రధానంగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేయాల న్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లూరు మండలం ఉల్లిందకొండ చెరువులో చేపల పెంపకం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... సబ్సిడీపై రైతులకు వాటర్ క్యారియింగ్ పైపులు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్య, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామలమ్మ, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలకు మరో రూ.20 వేలు

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి పొదుపు మహిళలకు మండల సమాఖ్యల నుంచి మరో రూ.20 వేలు రుణం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు నాగశివలీల, ఎం.వెంకటసుబ్బయ్యలను ఆదేశించారు. శనివారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్, ఉపాధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

క్రైం కార్నర్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

కర్నూలు : కర్నూలు నగరం గురుబ్రహ్మ నగర్‌లో నివాసముంటున్న పైపాడు సుధారాణి (45) ఈనెల 11వ తేదీన దారుణ హత్యకు గురయ్యారు. ఆమె కుమార్తె చంద్రలేఖ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈ ఘాతుకానికి పాల్పడింది ఆమె భర్త శ్రీనివాసరెడ్డేనని తేల్చి పక్కా ఆధారాలతో అరెస్టు చేసి కటకటాలకు పంపారు. వైఎస్సార్ జిల్లా కంబాలదిన్నెకు చెందిన సుధారాణికి మొదట సురేషతో వివాహం జరిగింది. వీరికి కుమార్తె చంద్రలేఖ ఏకైక సంతానం. 18 ఏళ్ల క్రితం భర్త చనిపోవడంతో కుమార్తెతో కలిసి కర్నూలుకు వలస వచ్చారు. ఆసుపత్రిలో పనిచేసే సమయంలో కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన పైపాడు శ్రీనివాసరెడ్డితో పరిచయం పెరిగింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ శ్రీనివాసరెడ్డి కర్నూలులోని శివయ్య నగర్‌లో ఉంటూ సుధారాణితో కలిసి సహజీవనం చేసేవారు. సుధారాణి టైలరింగ్ చేస్తుండగా కుమార్తె చంద్రలేఖ కడపలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతుండేది. సుధారాణిపై అనుమానం పెంచుకున్న శ్రీనివాసరెడ్డి తరచూ గొడవ పడేవాడు. ఈనెల 11వ తేదీ ఉదయం కూడా ఆమెతో గొడవ పడి కోపంతో సుధారాణిని చున్నీతో గొంతు బిగించి హత్య చేసి పారిపోయాడు. మృతురాలు దళిత మహిళ అయినందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ముద్దాయి శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు దిశ పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ

కర్నూలు అగ్రికల్చర్: కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి కోడుమూరుకు వెళ్తున్న మహాప్రస్థానం వాహనాన్ని అటువైపు నుంచి వస్తున్న లారీ ఎదురై ఢీ కొంది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. కర్నూలు శివారులోని రేడియోస్టేషన్ సమీపంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



3వ వార్డులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాల ఫలాలను ఇంటి వద్దకే చేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన 3వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట, కర్బలా మసీదు వీధి తదితర ప్రాంతాల్లో ప్రతి ఇంటి వద్ద ఆగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన స్థానిక సమస్యలను విని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తమ కాలనీలో రాత్రి వేళల్లో మంచినీరు వదులుతున్నారని, దీని వల్ల ఇబ్బంది ఉందని సుభద్రమ్మ చెప్పుకున్నారు. ఇంటి ముందు డ్రైనేజీ సరిగా లేక సమస్యగా ఉందని అన్వరాబేగం విన్నవించుకున్నారు. కుళాయికి నీరు గంట సేపు కూడా వదలడం లేదని, సమయాన్ని పెంచాలని సల్మాబీ కోరారు. ఈ సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వరం వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవల కోసం ప్రజలు వివిధ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించడంతో దరఖాస్తు మొదలు పథకం మంజూరు వరకు అన్ని వారే దగ్గరుండి చేయిస్తారన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్, నాయకులు ఖాదర్ బాషా, చాంద్, ఖుద్దూర్, నజీర్ అహ్మద్, ముజహిద్, గౌసియా, శేఖర్, భీమన్న, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష

కర్నూలు (సిటీ) : ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్కూల్స్, కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. పాఠశాల విభాగంలో 5వ తరగతి ప్రవేశాల కోసం, 6, 7, 8 తరగతులలో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 5,283 మంది దరఖాస్తు చేసుకోగా, 4,281 మంది పరీక్షలకు హాజరయ్యారు. 6వ తరగతి పరీక్షకు 1,460 మందికిగాను 1,094 మంది, 7వ తరగతి పరీక్షలకు 567 మంది దరఖాస్తు చేసుకోగా 413 మంది, 8వ తరగతి పరీక్షలకు 595 మంది దరఖాస్తు చేసుకోగా 463 మంది హాజరయ్యారు. కాలేజీ విభాగంలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం 7,546 మంది దరఖాస్తు చేసుకోగా 6,521 మంది హాజరు కాగా, 1,025 మంది గైర్హాజరయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ప్రవేశ పరీక్ష కోసం 409 మంది దరఖాస్తు చేసుకోగా 316 మంది హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



20వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 20 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రభుత్వం నుంచి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలలో 98శాతం అమలు చేశామన్నారు. పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా పట్టంకటాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, రంగారెడ్డి, భీమశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్ కన్వీనర్‌గా జేసీ

కర్నూలు(సెంట్రల్) : జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఎన్నికయ్యారు. శనివారం సివిల్ సప్లై కమిషనర్ అరుణ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారుల ఫోరాల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల ఫోరాలను బలోపేతం చేయడంలో భాగంగా జేసీలను మెంబర్ కన్వీనర్లుగా నియమించినట్లు చెప్పారు. వారు జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేసుకుని వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మార్కెట్ విలువ పెంపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జూన్ 1నుంచి ఇండ్లు, స్థలాలు, భూముల మార్కెట్ విలువను పెంచేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని క్రెడాయ్ చైర్మన్ సోమిశెట్టి వెంకటరామయ్య కోరారు. శనివారం క్రెడాయ్ ఆధ్వర్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ పీజీ కల్యాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సాయిరామిరెడ్డి తారకేష్, సురేష్‌కుమార్ , మల్లారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

కర్నూలు రూరల్ : వేసవి కాల ఫుట్‌బాల్ శిక్షణ తరగతులకు హాజరవుతున్న క్రీడాకారులకు స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో వ్యాపారవేత్త రామలింగప్ప టీషర్టులు పంపిణీ చేశారు. కోచ్ బ్రహ్మకుమార్, పాల్, శంకర్, జగదీష్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన కొత్త బస్టాండ్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు కొత్త బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఒక వేసవి సెలవులు, మరోవైపు పోటీ పరీక్షలు ఉండడంతో ప్రయాణాలు పెరిగాయి. శనివారం బస్టాండ్‌లో ప్రయాణికులకు తగిన బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు. బస్సు కనిపించగానే ఎక్కేందుకు పరుగులు పెట్టారు. సీటు కోసం ప్రయాణికుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, పత్తికొండ, బనగానపల్లె, నంద్యాల, అనంతపురం సెక్టార్ల వైపు వెళ్లే బస్సుల్లో నిల్చునేందుకు కూడా స్థలం లేకపోయింది.

నకిలీ విత్తనాలను నివారించాలి

కర్నూలు(సెంట్రల్) : ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతన్నకు నకిలీ విత్తనాల బారి నుంచి రక్షణ కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో పి.రామకృష్ణారెడ్డి, కుమార్, బాబయ్య, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం

కర్నూలు (హాస్పిటల్) : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ యువసేన ఆధ్వర్యంలో ఆయన అభిమానులు శనివారం కర్నూలు ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు.

ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు సిటీ: స్థానిక వన్‌టౌన్ ఎవరెస్ట్ స్కూల్‌కి చెందిన 2008 వ సంవత్సరం పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం ఆ స్కూల్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఐఎం స్వామి, ఉపాధ్యాయులు సరోజ, గాయత్రి, గీతా కుమారి, ఫాతిమా, కృష్ణయ్య, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, గిరిధర్, చంద్రశేఖర్, రాఘవేంద్ర, పూర్వ విద్యార్థులు వాదిరాజ్, శ్రీకాంత్, అమీర్, శివ, శ్రావణి, సుష్మ, తేజస్విని, ప్రసన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నాటికల పోటీల్లో 'రైతేరాజు'కు ప్రథమ స్థానం

కర్నూలు కల్చరల్ : టీజీవీ కళాక్షేత్రం, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త నిర్వహణలో ఈనెల 17, 18, 19 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీల్లో విజేతల వివరాలను శనివారం ఆ సంస్థల అధ్యక్షుడు పసుపులేటి వెంకటరమణ, పత్తి ఓబులయ్య ప్రకటించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన నాటికలను తిరిగి ఒంగోలులో ప్రదర్శిస్తారు. ఉత్తమ నాటిక ప్రదర్శనగా హైదరాబాద్ కళాంజలి వారి 'రైతే రాజు', ద్వితీయ స్థానంలో గుంటూరు అమృతలహరి వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక నిలిచిందన్నారు. అలాగే ఉత్తమ నటుడిగా ఒంగోలుకు చెందిన చౌదరి, ద్వితీయ నటుడిగా కె.శ్యామ్‌ప్రసాద్, ఉత్తమ నటిగా ఎం.రత్నకుమారి, ఉత్తమ ద్వితీయ నటిగా జ్యోతి రాణి, క్యారెక్టర్ నటిగా అమృతవర్షిణి, ఉత్తమ సంగీతం పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం, ఉత్తమ రంగాలంకరణ పి.బాబురావు, ఉత్తమ లైటింగ్ రమణ ఎంపికయ్యారన్నారు. అదే విధంగా రైతే రాజు నాటిక దర్శకులు కొల్లా రాధాకృష్ణ ఉత్తమ దర్శకుడు, ఉత్తమ రచనగా రైతే రాజు నాటకానికి రచన చేసిన సూర్యప్రకాష్ ఎంపికయ్యారన్నారు. మూడు రోజుల పాటు జరిగిన నాటికల పోటీలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రాజకీయంగా వెనకబడ్డ మాదిగలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు (అర్బన్): చట్ట సభల్లో 75 ఏళ్లుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన మాలలకు రాజకీయ పార్టీలు పెద్దపీట వేయడంతో మాదిగలు రాజకీయంగా వెనుకబడ్డారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగు రాష్ట్రాల చైర్మన్ పేరపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన రాజకీయ చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 50 లక్షల మంది మాదిగలకు చట్టసభల్లో సమన్యాయం జరిగేందుకు ఈ నెల 12వ తేదీ నుంచి అనంతపురం జిల్లా సింగనమల నుంచి మాదిగల రాజకీయ చైతన్య యాత్ర ప్రారంభమైందని చెప్పారు. మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే ప్రక్రియలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు 21 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలకు కేటాయించాలని కోరారు. అనంతరం రాజకీయ చైతన్య యాత్ర కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌మాదిగ, రెడ్డిపోగు విజయ్‌కుమార్, నగేష్, జయరాజు, పీటీ రాముడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును మత్స్యకారులు నమ్మరు

- జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో లేరని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాసులు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి బిల్లు పంపామని ఈ నెల 18వ తేదీన పెందుర్తి దగ్గర జరిగిన మత్స్యకారుల ఆత్మీయ సదస్సులో చంద్రబాబు పచ్చి అపద్దాలు చెప్పారని అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గతంలో తమ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని 75 రోజులు నిరాహార దీక్షలు చేసిన సమయంలో తోలు తీస్తాం, తొక్క తీస్తాం అన్న మాటలు మాకు ఇంకా గుర్తు ఉన్నాయన్నారు. పాలక ప్రభుత్వాలన్నీ మత్స్యకారులను రాజకీయంగా చులకనగా చూశాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే మత్స్యకారులకు రాజకీయంగా న్యాయం జరుగుతుందన్నారు. ఒక ఎంపీ, ఒక మంత్రి, రెండు ఎమ్మెల్యే, నాలుగు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో చిక్కుకుపోయిన మత్స్యకారులను తిరిగి మన దేశానికి తీసుకువచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మత్స్యకార భరోసాను రూ.4 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారన్నారు. కరోనా సమయంలో గుజరాత్, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలకు వలసలు వెళ్లిన వారిని మొదటి ప్రాధాన్యతగా ఇళ్లకు చేర్చారని గుర్తు చేశారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను మత్స్యకారులు ఎవరు నమ్మరాదని, మనల్ని అన్ని విధాల ఆదుకుంటున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.